# నీతి కలుగు జాతి నిజమైన జాతి!

ఎట్టి విద్యలు జగతిని యెరుగనట్టి
పక్షి జాతులు పశువులు పరమమైన
నియమమును బూని జీవింప నేర్చియుండ
తెలివి గల్గియు మనుజుడీ తెలివి దప్పి
బ్రతుకుచున్నాడు మనుజునకీ తెలివిలేదే
చిత్రంబులు త్రైలోక్య ప
విత్రంబులు భవలతా లవిత్రంబులు స
న్మిత్రంబులు ముని జన వన
చైత్రంబులు విష్ణుదేవు చారిత్రంబుల్

దివ్యాత్మ స్వరూపులారా!

సృష్టి చిత్రంబులు యెంత విచిత్రమయ్యె! ఏ లోకమునందుగానీ, ఏ కాలమునందుగానీ, ఏ యిరువురి మనుషులయొక్క రూపములు, తెలివితేటలు, ప్రజ్ఞాన విజ్ఞానములు సమముగా నుండుటలేదు. భౌతికవాదులు ఏకత్వముయొక్క అనేకత్వాన్ని విరివిగా ప్రచారము చేయటము యిది ప్రపంచముయొక్క సహజము. కానీ అనేకత్వములోని ఏకత్వాన్ని ప్రచారము చేసే వ్యక్తులు చాలా అరుదు. పవిత్ర దృష్టితో విశ్వవ్యాప్తమైన ప్రజ్ఞానముచే పరిశీలన జరిగినప్పుడు భిన్నత్వములోని ఏకత్వము సాక్షాత్కరిస్తుంది. ప్రాపంచికముగా, నైతికముగా, వైజ్ఞానికముగా ప్రతి మానవునికి ఆహార, విహారములు సమానమేనని గుర్తించటము జరుగుతూ వుంటుంది. రాజుమొదలు రైతువరకును, కూటి పేదమొదలు కోటీశ్వరునివరకును జనన, మరణములు సమానమనే సత్యాన్ని యేకత్వము విశ్వసిస్తుంది. జాతి, మత, వర్ణ, వర్గ, దేశ, కాల పరిస్థితుల ప్రభావమునకు

sri sathyasai vachanamrutam

యేమాత్రము గురికాక ఏకత్వమనే సత్యాన్ని కఠోపనిషత్తు బోధిస్తున్నది. ప్రతి శరీరముకూడను రథమువంటిదని యీ రథమునందు దేహి అనే సారధి ఒకడు ఆత్మస్వరూపుడై వున్నాడని తెలుస్తుంది.

## ఎట్టి భావమో అట్టి ఫలితము

మానవునియందు రెండు విధములైన తత్త్వములున్నవి. ఒకటి పశుత్వము, రెండవది దైవత్వము. దుష్టమైన కామ, క్రోధ, మోహ, లోభ, మద, మాత్సర్యములనే అరిషడ్వర్గములకు లోబడి భగవత్ ప్రసాదమైన స్థితి, గతి, మతి, సంపత్తిని సద్వినియోగపరచుకొనక దుష్ట మార్గమునందు ప్రవేశపెట్టి దుష్టుడై అనేక విధములుగా మానవుడు మరింత అధోగతికి దిగజారిపోతున్నాడు. ఈ విధముగా సత్యాన్ని గుర్తించక కేవలము అసత్యమునే విశ్వసించి, పరమాత్ముని విస్మరించి, తనయొక్క జీవితమును అధోగతిపాలు చేసుకోటమే పశుత్వముయొక్క తత్త్వము. మానవునియొక్క కాయమును, కాలమును, కర్మను, సంపదను సద్వినియోగపరచి నీతి, నిజాయతీలే జాతియొక్క లక్షణమని భావించి, వీటిని పరోపకార దీక్షగా విశ్వసించి తన కర్మలను పవిత్రము గావించుకొనటమే దైవత్వముయొక్క లక్షణము. మానవునియొక్క ప్రవర్తనను పురస్కరించుకొనియే వానియొక్క మంచిచెడ్డలు నిర్ణయింపబడుతూ వుంటాయి. ఎట్టి భావమో అట్టి ఫలితము.

## వేదములకు పుట్టినిల్లు భారతదేశము

కనుకనే ప్రాచీనకాలమునుండికూడను వేదములు, వేదాంగములు, స్మృతులు, యితిహాసములు, పురాణములయొక్క ప్రమాణములను ఆచరించి ఆనందించి అన్యులకు అందించే అవకాశమును కలిగించింది, మన భారతీయ సంస్కృతి. ఇవి అనంతమైన సాగరాలు, విజ్ఞాన నిలయాలు. ప్రతి నిత్యము సూర్యుడు తనయొక్క కిరణములచేత సముద్రమునుండి నీరును అవిరిగా మార్చుకొని ఆకాశమునందు మేఘములుగా రూపొందింప జేసుకొని, తదుపరి వర్షములను కురిపించి, పంటలను పండించి, ప్రకృతిని సస్యశ్యామలము గావించుచున్నాడు. యీవిధముగా నిత్యము సముద్రజలము అనంతముగా ఆవిరిగా మార్చుతున్నప్పటికి సముద్రము కొంచెముకూడా తగ్గిపోవటం

sri sathyasai vahini amrutam

లేదు. నదులు పొంగి ప్రవహించి గట్టులు తెగి గ్రామములను ముంచినప్పటికిని, అనేక నదులు ప్రవహించి సముద్రమునందు చేరుకున్నప్పటికిని సముద్రము కించిత్ మాత్రముకూడను పెరుగుటలేదు. ఇట్లు పెరిగి, తరగని తత్త్వాన్ని వహించినదే యీ సముద్రము. అదే విధముగ భారతీయ సంస్కృతిని తమలో ఇముడ్చుకున్న వేద వేదాంగములయొక్క తత్త్వము పండితులు తమయొక్క బుద్ధికుశలతచేత యెంత అందుకున్నప్పటికిని, ఎన్ని సంవత్సరములు, ఎన్ని యుగములు జరిగినప్పటికిని యిందులో యేమాత్రము తరిగే స్వభావము కాదు. ఇట్టి నిత్యసత్యమైన సంస్కృతిని భారతీయులు గుర్తించకొనలేక అలక్ష్యపరచటంచేత విదేశీయులు దీనిని స్వీకరించి దీనిచేత అనేక విధములైన ఫలితములు పొందగల్గుచున్నారు. వేదాంగములు కేవలము ఆధ్యాత్మిక తత్త్వములనే ప్రచురించటముకాక విలువైన వైజ్ఞానిక తత్త్వాన్నికూడను, సాంకేతిక విజ్ఞాన శాస్త్రమునుకూడను విరివిగా ప్రకటించటానికి పూనుకున్నవి. వేదములకు పుట్టినిల్లు భారతదేశము. కానీ యీ వేదముయొక్క విహారస్థానము విదేశములు. వేదములో నాల్గవ వేదమైన అధర్వణవేదము జపానులో చేరి, జర్మనీకి బయలుదేరి విదేశములందు అనేక విధములుగా వారికి వినియోగపడుతున్నది. ఈ వేదము ఖగోళశాస్త్రము, తర్కశాస్త్రము, శిల్పశాస్త్రము, చిత్రశాస్త్రము, పదార్థశాస్త్రములతోకూడినది. ఇది గణితశాస్త్రము, సాముద్రిక శాస్త్రములందుకూడను గొప్ప పేరు పొందినది. ఈ ఖగోళ శాస్త్రము యొక్క అనేక చిత్ర, విచిత్రములను విదేశీ శాస్త్రజ్ఞులు నేడు గుర్తిస్తూ వచ్చారు.

**మానవునియొక్క విలువ ధనకనకవస్తువాహనాదులలో లేదు, శీలమందే ఉన్నది**

ఒకానొక సమయములో గొప్పతత్త్వవేత్త అయిన Sir.W.Hunter అనేవాడు ఉండేవాడు. ఇతడు అధర్వణ వేదములోని ఖగోళ శాస్త్రముయొక్క తత్త్వాన్ని గుర్తించి ఇది గ్రీసు దేశములోని శాస్త్ర విజ్ఞానముకంటె మించినదిగా వుంటున్నదని వర్ణిస్తూ వచ్చాడు. ఈ విధమైన దివ్యమైన, విలువైన, పవిత్రరత్నములను మనము ఈనాడు గుర్తించుకొనలేకపోతున్నాము. రష్యాదేశములో ఉత్తరదిశయందు మాస్కోకు యించుమించు వేయిమైళ్లదూరములోపల ఒక విశాలమైన పట్టణమున్నది. ఆ

sri sathyasai vahini amrutam

పట్టణమునందు భారతీయ సంస్కృతిని ప్రతిబింబించే మహా గ్రంథములు గల ఒకపెద్ద గ్రంథాలయమును నిర్మించుకున్నారు. అదే కాజా పట్టణము. ఈ కాజా పట్టణమునకు నాలుగువేలమైళ్ల దూరములో 'సుఖానది' ప్రవహిస్తూ వుంటుండాది. ఈనాడు ఆ సుఖానదినే 'అను' అని పిలుస్తూవస్తున్నారు. దీనికి సమీపములో చాలా విలువైన సువర్ణము లభ్యమవుతున్నదని అథర్వణశాస్త్రముద్వారా గుర్తిస్తూ వచ్చారు. అక్కడే Vladivostak అనే పెద్ద పట్టణమున్నది. ఈ పట్టణ సమీపములో అథర్వణవేదముయొక్క తత్త్వాన్ని చక్కగా గుర్తించిన శక్తిమంతులు పరిశీలన చేయగా యిక్కడ అరువదితొమ్మిది సువర్ణపు గనులంతా ఉన్నాయని కనిపెట్టారు. దీనికి దోహదపడిన భారతీయులయొక్క పవిత్రతను వారు గుర్తించి యిలాంటి మహాభాగ్యము తమకు లభ్యమైనదని వారు యెంతయో దానిని వర్ణిస్తూ కృతజ్ఞతా పూర్వకంగా ఆ ప్రాంతమునకొక చక్కని భారతీయ పేరును 'మహానిధి' అని పెట్టారు! భారతదేశమునుండి తమకు సంక్రమించిన అథర్వణవేదముయొక్క అనుగ్రహమే యిదని, భారతీయులయొక్క మహోన్నత తత్త్వానికి గుర్తుగా యీ పేరును వారు పెట్టారు. రష్యనులయందు భగవన్నామములను వుచ్చరించే వుత్సాహములేదు. కానీ, వారియందు ఘనమైన నీతి, నిజాయతీలు వుంటున్నవి. ఈ నీతి నిజాయతీలే వారిని ఒక గొప్ప జాతిగా రూపొందించాయి. మానవజాతికి ప్రధానమైన గుణమే శీలము. ఈ విధమైన గుణములు, సరైన నడత లేకుండిన యిది మానవత్వమే కానేరదు. మానవునియొక్క విలువ ధనకనక వస్తువాహనాదులలోలేదు. మానవునియొక్క నడతలోనే వుంటున్నది. కనుక, మానవునియొక్క నీతిని గుర్తించటానికి ప్రయత్నించాలి. 'నీతి కలుగుజాతి నిజమైన జాతిరా', అన్నారు. ఈ నీతియే మానవత్వముయొక్క తత్త్వాన్ని గుర్తించటానికి తగిన విలువ.

**పవిత్రత, సహనము, పట్టుదల, ఈ మూడు మానవుని శీలములో ప్రధాన ఆంశములు**

భారతీయ సంస్కృతిని అనేక విధములుగా ప్రశంసించి, బోధించి, తద్వారా నీతియే ప్రధానమైన గుణమని విశ్వసిస్తూ వచ్చారు. సరియైన ప్రవర్తనే లేకుండిన, యిది మానవత్వమే కాదనికూడను విశ్వసిస్తూ వచ్చారు. మానవునియొక్క శీలమనగా మూడు విధములైన తత్త్వములతోకూడినదని మనము గుర్తించాలి. మొదటిది పవిత్రత, రెండవది



sri sathyasai vahini amrutam

సహనము, మూడవది పట్టుదల. దీనినే P+P+P=C అనగా Purity+Patience+Perseverence= Character అన్నారు. అయితే, యీనాడు అట్టి పవిత్రత వున్నదా? పవిత్రత మనకు యేమాత్రముకూడను కనుపించటములేదు. ఈ పవిత్రత వుండినప్పుడే మనలో సహనము యేర్పడుతుంది. పవిత్రత, సహనము రెండు కూడినప్పుడే మనలో ఒక పట్టుదల, ధృడత్వము యేర్పడుతుంది. ఈ మూడింటికిని అవినాభావసంబంధము, అన్యోన్యాశ్రయముగా కూడిన తత్త్వాన్ని మనము యీనాడు వ్యర్థము గావించుకొంటున్నాము. మన శరీరమును ఒక ప్రయోజనమునకు వుపయోగించాలి. 'పరోపకారార్థం ఇదం శరీరం' అన్నారు. ఈ శరీరమనేది సమాజముయొక్క సేవ నిమిత్తమై, సత్యాన్వేషణ నిమిత్తమై, అనేకత్వములో వున్న యేకత్వమును గుర్తించే నిమిత్తమై ప్రాప్తించినదని మనము అర్థము చేసుకోవాలి. సహనము. దేని నిమిత్తమై సహనము? ఇది మనయొక్క స్వభావముగా రూపొందాలి. మానవత్వములో వుండిన సహనమే దివ్యత్వముగా మారి అదే దైవత్వముగా రూపొందుతుంది. ప్రతి కష్టమునకు, నష్టమునకు, దుఃఖమునకు, నిందలకు, నిష్ఠూరములకు మనము సహనాన్ని వహించాలి. సహనమే లేకుండిన జీవితమే సాగదు. కనుక, సహనమన్నది మన భారతీయ సంస్కృతియొక్క ప్రధానమైన లక్షణము.

**పరమ పావనమైన భారతావనియందు**
**సహన మన్నదె మనకు చక్కదనము**
**వ్రతము లన్నిటియందు వన్నెగాంచిన యట్టి**
**ఘనసత్యశీలమే కఠిన తపము**
**మధుర భావంబేది మన దేశమందన్న**
**మాతృ భావముకంటె మాన్యమెద్ది**
**ప్రాణంబుకంటెను మానంబె ఘనమను**
**మనదేశ నీతిని మంటగలిపి**
**నేటి కిచ్చిరి పరదేశ నీతులరసి**
**వెస విచిత్రస్వేచ్ఛయను విచ్చుకత్తి**

sri sathyasai vahinamrutam

**ఔర! ఏమందు భారత పాలనంబు**
**ఏనుగెట్టుల తన బల మెరుగలేదో**
**అట్టులైనారు భారత ప్రజలు నేడు**

**మన ప్రవర్తన సరిగా ఉన్నప్పుడు ప్రకృతికూడా సహకరిస్తుంది**

ఈనాడు మానవులకు గుణము అంటే యేమిటో అర్థము కావటములేదు. అర్థము చేసుకొనుటకైనా ప్రయత్నించటము లేదు. ప్రయత్నించికూడను వికారమార్గమునందు దానిని అర్థము గావించుకొనుచున్నారు. కనుక, యీనాడు మానవత్వమునే కోల్పోయి దానవత్వముకంటెను హీనమైన ప్రవర్తనలో మానవుడు జీవితాన్ని వ్యర్థము గావించుకొనుచున్నాడు. కేవలము మానవునియొక్క ఆకారమును మాత్రమే ప్రకటించుచూ, ప్రచురించుచూ తనయొక్క దివ్యత్వమైన ఆత్మతత్త్వాన్ని విస్మరిస్తున్నాడు. కనుక ఎక్కడ చూచినా, ఎక్కడ విన్ననూ ఒక విధమైన భయ భ్రాంతులతోకూడి వుంటుండాది జగత్తు. ఈనాటి యుద్ధములకు, భయభ్రాంతులకు, కరవుకాటకములకు మూలకారణమేమిటి? మన ప్రవర్తనయే! సరైన ప్రవర్తన మనము కలిగియుండినప్పుడు యీ ప్రకృతికూడను సరైన ఫలితము అందిస్తూ వుంటుంది. చెప్పుమాటలకు, చేయు పనులకును పొంతనలేని జీవితమును మనము అనుభవిస్తున్నాము. The proper study of mankind is man అన్నారు. ఈ తత్త్వాన్ని మనము గుర్తించుకోటానికి యీనాడు యేమాత్రము ప్రయత్నము చేయటములేదు.

**నైతిక జీవితముతోబాటు ఆధ్యాత్మిక జీవితమునుకూడా బోధించునదే మన సంస్కృతి**

ఈనాడు మానవుడు సాంకేతిక విజ్ఞాన శాస్త్రములో విరివియైన బలమును సంపాదించుకున్నప్పటికి నైతిక విలువలు దినదినమునకు దిగజారిపోతున్నవి. నైతికమైన జీవితమే లేకుండిన అది జీవితమనే అనిపించుకోదు. నైతిక జీవితముతోబాటు, ఆధ్యాత్మిక జీవితముకూడను ప్రచురింపజేసినదే మన సంస్కృతి. ఇట్టి సంస్కృతిని గుర్తించటానికి సంస్కృత విద్యను మనము అభ్యసించాలి. జర్మనీలో, రష్యాలో, అమెరికాలో యిత్యాది ప్రాంతములందుకూడను భారతదేశమునుండి కొనిపోయిన వేదగ్రంథములు అధ్యయనం

srisathyasaivachanamrutam

చేసే నిమిత్తమై తప్పనిసరిగా అనేక విశ్వవిద్యాలయములలోపల సంస్కృతమును అభ్యసించటానికి ప్రయత్నములు జరుగుతున్నాయి. మన ప్రాచీన గ్రంథములన్నీ సంస్కృతమునందే లిఖించబడినవి. ఆ సంస్కృతమునుండి ఆవిర్భవించినదే సంస్కృతి. సంస్కృత భాషకు ఈ విధమైన ప్రోత్సాహ ఉత్సాహములు విదేశములందుకూడా పెరిగిపోవుచున్నప్పటికి దీనికి సరియైన ఆదరణ లేదని చెప్పుకొనటము చాలా విచారకరమైన విషయము. ప్రాచీనకాలమునుండి భారతదేశము అన్ని దేశములకును ఉపాధ్యాయస్థానము అలంకరించినది. ఈ సంస్కృతమునందున్న సంస్కృతియొక్క తత్త్వాన్ని విదేశీయులుకూడను యెంతో శ్రద్ధతో, భక్తితో అనుభవించటానికి ప్రయత్నిస్తున్నారు. విదేశీయులయొక్క లౌకిక భోగభాగ్యములనే మనము అనుసరించటానికి ప్రయత్నిస్తున్నాముగాని పవిత్రము, నిర్మలము, నిస్వార్థము అయిన మన సంస్కృతిని యేమాత్రముకూడను ఆచరణలో పెట్టుటకు ప్రయత్నము చేయటం లేదు. 'ఎన్న భారతే తన్న భారత'. భరతదేశములో లేనిది మరొకదేశములో యేమాత్రముకూడను కనుపించదు. భారతదేశములోని రూపములుగాని, నామములుగాని యే పదార్థములుగానీ చాల పవిత్రమైనవనికూడను అందరూ గుర్తిస్తూవచ్చారు.

**భారతీయులు భారతదేశ సంస్కృతిని గుర్తించుకొనలేకపోవటము చాలా అవమానము**

గ్రీసుదేశపు ఒకానొక రాజు భారతదేశమునకు ప్రయాణమై వచ్చుచుండగా ఆయన మతగురువు ఆ రాజుతో 'ఓ రాజా! నీవు పవిత్రమైన భారతదేశములో పాదము పెట్టుచున్నావు. కాన, నాయొక్క చిరకాల వాంఛను నీవు తీర్చగలవని నేను విశ్వసిస్తున్నాను' అన్నాడు. 'పవిత్రమైన గంగాజలమును ఒక పాత్రలో తీసుకొని రమ్మ'న్నాడు. 'దివ్యమైన భగవద్గీతను ఒకటి తీసుకురమ్మ'న్నాడు. 'భారతదేశముయొక్క పవిత్రమైన ధూళి కొంత తీసుకొని రమ్మ'న్నాడు. 'మానవాతీతమైన శక్తులను గుర్తించి మానవాతీతమైన జీవితాన్ని అనుభవించిన మహా భక్తుల చరిత్రలుగల మహాభారతముయొక్క ఒక ప్రతినికూడను తీసికొని రమ్మ'న్నాడు. 'మహాభారతమునందు నైతిక, భౌతిక, లౌకిక, ఆధ్మాత్మిక, వైజ్ఞానిక సంబంధమైన సూత్రములన్నీకూడను యిమిడి వున్న'వని బోధించాడు. విదేశీయులు

srisathyasaivachanamrutam

భారతముయొక్క రహస్యాన్ని యీ విధముగా గుర్తిస్తే, భారతీయులు మాత్రము భారతమును గురించి 'వింటే భారతము వినాలి, తింటే గారెలు తినాలి' అని గారెలతో పోల్చుకుంటున్నారు. మహా శ్రీమంతుడు, ధనవంతుడు అయినవాడు కుబేరుడు, భారతదేశములో. యిండోనేషియాలో ఒక బ్యాంకుపేరు 'కుబేరా' అని పెట్టుకున్నారు. ఆ దేశపు ఏర్‌లైన్సుకి 'గరుడ' అని పేరు పెట్టుకున్నారు. గరుడ అంటే ఎంత పవిత్రమైనది! విష్ణువాహనమని వారు గుర్తించారు. విష్ణువు అనగా సర్వవ్యాపకుడు, సర్వజ్ఞుడు అయినవాడు. యీ గరుడవాహనుడై సర్వత్ర వ్యాపించుచున్నాడు, అనే సత్యమును వారు అర్థము చేసుకున్నారు. కానీ భారతీయులు మాత్రం 'గరుడ' అంటే ఒక పక్షిగా భావిస్తున్నారు. నిజముగా మనము భారతీయులమని చెప్పుకోవటముకూడను చాలా సిగ్గు చేటుగా వుంటున్నది. ఒకానొక సమయములోపల 'చతుర్వేది' అనే పేరుగల ఒక వ్యక్తి జర్మనీ వెళ్ళాడు. ఆ పేరుకు అర్థము నాలుగు వేదములు అధ్యయనం చేసిన వాడని. ఈ విధముగా నాలుగు వేదములు అధ్యయనం చేసిన వ్యక్తి గొప్ప వేద పండితుడని అనుకున్నారు, ఆ దేశస్థులు. ఒకానొక సమయములోపల Max Muller అనే జర్మను పండితుడు వేదములను జర్మను భాషలోనికి తర్జుమా చేస్తూ కొన్ని మంత్రములకు అర్థము తెలియక సందిగ్ధంలో పడ్డాడు. దానికొరకు అనేక మందిని విచారిస్తూ వచ్చాడు. ఆ రోజుల్లో విదేశములకు వెళ్లిన ప్రతి వ్యక్తి Max Muller ను చూసివచ్చేవారు. ఆ చతుర్వేదికూడను Max Muller ను చూచి రావాలని అతనివద్దకు వెళ్లి తన విజిటింగు కార్డు లోపలకు పంపించాడు. Max Muller ఆ కార్డు చూచి, అతని పేరు చదివి పట్టలేని ఆనందముతో వుక్కిరిబిక్కిరయ్యాడు. 'తాను ఒక వేదార్థమును గుర్తించాలని ప్రయత్నిస్తుంటే భారతదేశమునుంచి ఏకంగా ఒక చతుర్వేదశాస్త్రే వచ్చాడు, యిది భగవంతునియొక్క అనుగ్రహమే' అని భావించాడు. తక్షణమే Max Muller స్వయముగా వెళ్లి ఆ చతుర్వేదిని లోపలకు తీసుకు వచ్చాడు, సగౌరవముగా. అతడు లోపలకు అడుగుపెట్టిన తక్షణమే సాక్షాత్తూ భగవంతుడే తన సందేహ నివృత్తికొరకు వచ్చినట్లుగా భావించాడు, Max Muller. ముందుగా Tea, biscuits ఇచ్చి అతనిని తృప్తి పరిచాడు. 'మీరు ఎక్కడనుండి వచ్చారని ప్రశ్నించగానే' చతుర్వేది 'నేను భారతదేశమునుండి వచ్చా'నన్నాడు. నీ పేరు యేమనగా 'నా

srisathyasaivachanamrutam

పేరు చతుర్వేది' అన్నాడు. అప్పుడు Max Muller 'అహా! ఎంత అదృష్టవంతుడవు! నీవు భారతదేశమునందు వుద్భవించినవాడవు, నీ జన్మ సార్థకమైంది', అన్నాడు. తక్షణమే ఒక గ్రంథము తీసుకువచ్చి 'యీ పదమునకు అర్థము ఏమిటి', అని అడిగాడు. ఈ వ్యాఖ్యానము ఎక్కడవున్నదని అడిగాడు, యీ చతుర్వేది. 'ఇదుగో ఫలాని భాష్యములో వుంటున్నద'ని చెప్పాడు. చతుర్వేదికి ఆ పదముయొక్క అర్థము ఏ మాత్రము తెలియదు. అంతేకాదు, అతనికి వేదములగురించి ఏ మాత్రము అవగాహన లేదు. ఆ విషయము Max Muller యెదుట అంగీకరించాడు. 'పోనీ శంకరాచార్యుల విషయమేమైనా తెలుసునా?' అని ప్రశ్నించాడు, Max Muller. చతుర్వేది 'ఆ శంకరచార్యులు ఎవరో చాదస్త బ్రాహ్మణుడు' అని జవాబిచ్చాడు. అప్పుడు అనుకున్నాడు, Max Muller: "ఇంతకు పూర్వము నా శేష జీవితమంతా భారతదేశములోపల గడపుకొని భారతదేశమందే నా జీవితమును అంత్యము గావించుకోవాలని విశ్వసించుకున్నాను. ఈ చతుర్వేదశాస్త్రియొక్క జవాబులు విన్న తరువాత భారతదేశములో జన్మించిన వారందరుకూడను పండితులు కాదు. ఎక్కడ వుండినప్పటికి, హృదయస్థాయి ప్రధానమైనది" అని. భగవంతుని స్మరించుకుంటూ నా దేశములో ఉండాలిగాని, భారతదేశము వెళ్లకూడదని నిర్ణయించుకున్నాడు. ఈ విధముగా భారతీయులు మన శాస్త్రములు, మన సంస్కృతిని, మన సాధనను, మనయొక్క నీతి నిజాయతీలను యేమాత్రము గుర్తించుకొనలేక ఉన్నత చదువులకై విదేశములకు వెళ్లటమనేది చాలా అగౌరవమైన విషయము. విదేశీయులు భారతదేశము వచ్చి భారతీయ సంస్కృతీ, సాంప్రదాయాలను, విషయాన్ని చక్కగా తెలుసుకొనగోరి అనేక విధములైన శ్రద్ధాభక్తులు నిరూపించుచుండగా భారతీయులు భారతదేశమునందే పుట్టి పెరిగి తమయొక్క సంస్కృతిని గురించుకోలేక పోవటము యెంత వెఱ్ఱితనము!

**ఎట్టి కర్మలు ఆచరింతుమో అట్టి ఫలితము మనకు సిద్ధిస్తూ ఉంటుంది**

కనుక, భారతీయ సంస్కృతియందు ప్రధానమైన అంశము, శీలము. ప్రాచీన కాలమునుండి భారతదేశములో యీ Character అనగా శీలమునకు యెక్కువ ప్రాధాన్యమునిస్తూ వచ్చేవారు. కనుకనే పూర్వము దేశ సంస్కృతిని పురస్కరించుకొని యీ

sri sathyasai vahini

Character పోతే Life పోయినట్టుగా వారు బాధపడేవారు. If Character is lost, everything lost. If wealth is lost, nothing is lost. If health is lost, something is lost. యివి భారతీయ సంస్కృతియొక్క ప్రధానమైన సూత్రములు. కానీ యీనాడు కారుకు రివర్సు గేరు వుండినట్టుగా ఆధునిక జీవితములో ఇందుకు విరుద్ధముగా జరుగుతూ వస్తున్నాది. If Character is lost nothing is lost; If health is lost something is lost; If wealth is lost everything is lost అని భావిస్తున్నారు, భారతీయులు. ఇదే 'ధనమూల మిదం జగత్'. కొంచెం ఆలోచించండి! ఇదా మన నిజమైన భారతీయ సంస్కృతి? 'ధర్మమూల మిదం జగత్'. యిదే భారతీయుల నిజమైన సంస్కృతి. ఈనాడు ధర్మాన్ని రక్షించుటకు ఎవ్వరుకూడను ముందంజ వేయటంలేదు. కానీ, అధర్మము ఆచరించుటకు ముందుకు వస్తున్నారు. కనుకనే, దేశము పాపభూయిష్టముగా మారిపోవుచున్నది. మనము పాపమునకు గురికాకూడదు, పుణ్యమును ఆచరించాలి. దీనినే భారతీయ సంస్కృతియందు

**పుణ్యశ్చ ఫలమిచ్ఛంతి న పుణ్యం కుర్వంతి మానవాః**
**న పాప ఫలమిచ్ఛంతి పాపం కుర్వంతి యత్రతః**

అనగా పుణ్యము చేయటము చాలా మంచిదని చెబుతున్నాము. పుణ్యము కావాలని ఆశిస్తున్నాము. కానీ పుణ్యకర్మలు చేయటములేదు. పుణ్యకర్మలు చేయక పుణ్యఫలము ఏరీతిగా లభ్యమవుతుంది? పాపఫలము నాకు వద్దని అంటున్నాము. కానీ పాపకర్మలు ఆచరిస్తున్నాము. పాపకర్మలు ఆచరించినప్పుడు పాపఫలము వద్దంటే పోదుకదా! ఎట్టికర్మలు ఆచరింతుమో అట్టి ఫలితము మనకు సిద్ధిస్తూ వుంటుంది. కనుక, పవిత్రమైన కర్మలు ఆచరించటానికి ప్రతివ్యక్తికూడను పూనుకోవాలి. ఈ మానవత్వమనేది యెంతో పవిత్రమైనదని మనం గుర్తించటానికి ప్రయత్నించాలి. భారతీయ సంస్కృతియొక్క విలువలను మనము అర్థము చేసుకోవాలి. ఒక వేళ అలా అర్థము చేసుకొనుటకు సమయము లేకపోయినా, యిష్టములేకపోయినా దీనికి పెడర్థములు కల్పించటానికి ప్రయత్నించకూడదు. వీటిని హాస్యాస్పదము చేయటానికి అంతకంటే ముందంజ వేయకూడదు. గౌరవించటానికి ప్రయత్నించాలి. కృతజ్ఞతను నేర్చుకోవాలి. కానీ, మనము

sri sathyasai vachanamrutam

పొందిన ఫలితమునకు కృతజ్ఞత చెప్పకుండా క్రూరులుగా మారిపోతున్నాము. ఈనాటి యువకులు యేవిధమైన పలుకులు వుచ్చరిస్తున్నారో వాటిని ఆచరణలో పెట్టటానికి తగిన కృషి చెయ్యాలి. కేవలము మాటలయందు మాత్రమే చెప్పి క్రియలందు వినియోగించకుండిన, యిది మానవత్వమునకు విరుద్ధమైన తత్త్వము. కనుక యేవిధమైన భక్తిశ్రద్ధలతో మీరు యిట్టి వుపన్యాసములు వింటున్నారో వాటియందలి సందేశమును జీవితపర్యంతముకూడను మీరు ఆచరణయందుంచి, ఆనందించి, పదిమందికి అందించటానికి ప్రయత్నించాలి. చిత్తశుద్ధి గల విద్యార్థులు, యువకులు కేవలము ఒక పదిమంది చిక్కినప్పటికిని చాలు, జగత్తునందంతా మనము ప్రచారము సలుపవచ్చును. ప్రచారమునకు ముందు నీవు మొట్టమొదట ఆచరించు, అనుష్టించు, అనుభవించు, ఆనందించు; తదుపరి పదిమందికి పంచు. ఇది మీయొక్క కర్తవ్యముగా మీరు కంకణము కట్టుకోవాలి. కర్తవ్యమును నిర్వర్తించుకోటమే మనయొక్క ప్రధానమైన ధర్మముగా మనము గుర్తించాలి.

**జ్ఞానమే లేకపోతే మానవుడు పశువుతో సమానము**

కాలము అతివేగముగా ప్రచండమారుతమువలె కదలిపోవుచున్నది. జీవితప్రమాణము మంచుగడ్డవలె క్షణక్షణమునకు కరగిపోవుచున్నది. కర్తవ్యమును గుర్తించక మునుపే కాయమును వదలిపెడుతున్నాడు, మానవుడు. మానవుడు పుట్టినందుకు ఫలితమేమిటి? దేని నిమిత్తము నీవు పుట్టావు? తిండి నిద్రాదులకోసమా? భయమైథునాదులకోసమా? కాదు కాదు.

**ఆహారనిద్రా భయమైథునాని సమానమేతత్ పశుభిర్నరాణాం**
**జ్ఞానం నరాణా మధికం విశేషః జ్ఞానేన శూన్యః పశుభిస్సమానః**

ఇలాంటి జ్ఞానమే లేకపోతే పశువుతో సమానము, ద్విపాద పశువనే చెప్పవచ్చును. ఆహార, నిద్ర, భయ, మైధునాదులు పశుపక్షి మృగాదులకుకూడ వుంటున్నవి. ఇలాంటివి

sri sathyasai vachanamrutam

అనుభవించే నిమిత్తము మానవజన్మ రావాలా? కాదు, కాదు. ఆదర్శవంతమైన జీవితాన్ని అనుభవించాలి, అందించాలి. అందులో విద్యార్థులకు యిది ప్రధానమైన లక్షణముగా భావించాలి. వారే భవిష్యత్తులో నాయకులు. కనుక, వారియొక్క భావములను సున్నితమైనవిగాను, పవిత్రమైనవిగాను, నిర్మలమైనవిగాను, నిస్వార్థమైనవిగాను, తీర్చిదిద్దుకొనుటకు తగిన కృషి చెయ్యాలి. పవిత్రమైన భారతీయ సంస్కృతిని ప్రచారములో ఆచరించి ఆనందించటానికి తగిన ప్రయత్నము చేయాలని ఆశిస్తూ, ఆశీర్వదిస్తూ నేను విరమిస్తున్నాను.

**(తేదీ 10-10-1986న పూర్ణచంద్ర సభామంటపములో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam